### "ఆర్జీయూకేటీ బాసరలో పరిశ్రమ-విశ్వవిద్యాలయ భాగస్వామ్యంతో

# 'ఏజెంటిక్ ఏఐ' శిక్షణా సమారోహం"






మెట్రో న్యూస్, నిర్మల్ ప్రతినిధి:-ఆర్జీయూకేటీ బాసర ట్రిపుల్ ఐటీలో వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ఇ4 విద్యార్థులకు మార్చి 2 నుండి ఆగస్టు 14, 2026 వరకు నిర్వహించిన 90 రోజుల 'ఏజెంటిక్ ఏఐ, మెషిన్ లెర్నింగ్' సర్టిఫికేట్ కోర్సు విజయవంతంగా ముగిసింది. ఏబి 3 కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ ముగింపు కార్యక్రమానికి గౌరవ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ ముఖ్య అతిథిగా, ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ మురళీదర్శన్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ ఏ గోవర్ధన్, మారుతున్న పరిశ్రమ అవసరాలకు తగినట్లుగా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో పరిజ్ఞానం సాధించడం ద్వారా భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను సులువుగా అందుకోవచ్చని దిశానిర్దేశం చేశారు. అనంతరం ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ మురళీదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతికతలలో ప్రయోగాత్మక శిక్షణ పొందడమే కాకుండా, అధ్యాపకులు కూడా మారుతున్న శోధనా పరిజ్ఞానానికి అనుగుణంగా బోధనా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద రహేజా సంస్థ సౌజన్యంతో, నిర్మాణ్ మేనేజింగ్ పార్టనర్గా, స్విఫ్ఫీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ శిక్షణ భాగస్వామిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిశ్రమ నిపుణులు సతీష్, స్విఫ్ఫీ సొల్యూషన్స్ సీఈఓ రాణి. జి నేతృత్వంలో అందించిన ఈ శిక్షణ ద్వారా మొత్తం 120 మంది విద్యార్థులు ప్రత్యక్ష అవగాహన పొందారు. ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. విజయ్ కుమార్ సమన్వయంతో సాగిన ఈ కార్యక్రమం విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు పరిశ్రమ - విద్యాలయ భాగస్వామ్యానికి విశేషంగా దోహదపడింది.

# వేములవాడలో ఘనంగా వనమహోత్సవం.. కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ పుల్కం రాజు

**త్వరలోనే ఇంటింటికీ పూల, పండ్ల మొక్కల పంపిణీ**

**భవిష్యత్తు తరాల కోసమే పర్యావరణ పరిరక్షణ**

**పట్టణాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దుతాం**

**ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి: వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



మెట్రో న్యూస్ రాజన్న సిరిసిల్ల వేములవాడ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలోని 11వ వార్డులో బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై వార్డు వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి దాదాపు 500 మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రభుత్వం ఎంతో ఆశయంతో నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలో విజయవంతంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. రాబోయే భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని రక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. త్వరలోనే స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలో వేములవాడ పట్టణంలోని ప్రతి ఇంటికీ ఒక పూల మొక్క, ఒక పండ్ల మొక్కను ఉచితంగా పంపిణీ చేసేందుకు మున్సిపల్ పాలకవర్గం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆయన వెల్లడించారు. పట్టణాన్ని పచ్చదనంతో నింపి, పర్యావరణ పరిరక్షణలో వేములవాడను ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ వనమహోత్సవంలో భాగస్వాములై తమ ఇళ్ల వద్ద, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, స్థానిక వార్డు మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సందర్శించిన బిజెపి నాయకులు



జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19 (మెట్రో న్యూస్) : కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను బిజెపి నాయకులు సందర్శించారు. బుధవారం ధర్మపురి బిజెపి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రి --- జశీఎఎబఅఱఎ నముశ్రీష్ట్ర జవత్తీవ ను సందర్శించాం. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మా ఉద్దేశం రాజకీయ విమర్శలు చేయడం కాదు. ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందాలి. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు అప్పులు చేసి వెళ్లాల్సిన పరిస్థితి రాకూడదు అనేదే భారతీయ జనతా పార్టీ ధర్మపురి పట్టణ శాఖ డిమాండ్. ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేద ప్రజలకు నమ్మకం. ఆ నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

**ప్రభుత్వానికి మా ప్రశ్న ఒక్కటే**

24 గంటల వైద్య సేవలు కాగితాల మీద మాత్రమేనా? ప్రజలకు వాస్తవంగా 24 గంటల సేవలు అందుతున్నాయా? ఈ విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా ప్రజలకు చెప్పాలి.

ప్రభుత్వానికి ధర్మపురి ప్రజల పక్షాన దీజీూ తరపున అడుగుతా ఉన్నాము. ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ధర్మపురి జఎజలో 24ఐ7 అత్యవసర వైద్య సేవలు నిరంతరం అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలకు అవసరమైన అన్ని ఉచిత మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా తగిన స్టాక్ ఏర్పాటు చేయాలి. ల్యాబొరేటరీ సేవలను బలోపేతం చేసి, అవసరమైన అన్ని ప్రాథమిక వైద్య పరీక్షలు అందుబాటులోకి తేవాలి. పనిచేయని వైద్య పరికరాలను వెంటనే మరమ్మతు చేయాలి లేదా కొత్త పరికరాలు ఏర్పాటు చేయాలి. గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధులు, అత్యవసర రోగులకు ప్రత్యేక ప్రాధాన్యతతో వైద్య సేవలు అందించాలి. అంబులెన్స్ సేవను 24 గంటలు సమర్థవంతంగా అందుబాటులో ఉంచాలి. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, రోగుల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. ఆసుపత్రికి కేటాయించిన నిధులు, వాటి వినియోగం, పెండింగ్ పనుల వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలి. ధర్మపురి జఎజ అభివృద్ధిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి, కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలి. మా పోరాటం ఎవరి మీద వ్యక్తిగతంగా కాదు. మా పోరాటం ప్రజల ఆరోగ్యం కోసం. పేదవాడు ఆసుపత్రికి వచ్చినప్పుడు అతని జేబులో డబ్బు ఎంత ఉందో చూడకూడదు --- అతనికి అవసరమైన వైద్యం ఎంత త్వరగా అందించగలమో చూడాలి. ధర్మపురి ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే "మందులు లేవు, డాక్టర్ లేరు, పరికరాలు పనిచేయడం లేదు, బయటికి వెళ్లండి" అనే పరిస్థితి ఉండకూడదు. ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

"ప్రజలకు వైద్యం హక్కు --- ధర్మపురి జఎజని బలోపేతం చేయాలి."

ఈ రోజు మా ఆసుపత్రి సందర్శనలో గుర్తించిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. ధర్మపురి ప్రజల కోసం, మెరుగైన ప్రభుత్వ వైద్యం కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం ప్రజల తరపున పోరాడుతుంది. ఈ కార్యక్రమంలో ధర్మపురి బిజెపి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవన్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి తీర్మాందాస్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు పల్లెర్ల సురేందర్, స్తంభంకాడి శ్యామ్, తోట శ్రీనివాస్, బీజేవైఎం నాయకులు మండలోజీ సూరజ్, ఉపాధ్యక్షులు సుంకు మధుసూదన్, బాకీ అనిల్, కార్యదర్శి ఠాగూర్ రాకేష్, ఆనందాస్ నవీన్, పుదరి పవన్, మామిడిపల్లి రంజిత్, కొత్తకొండ రాజు ,నర్సయ్య, మరియు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల గోదావరి నీటి పైపులైన్ ధ్వంసం వరుసగా మూడుసార్లు పైపుల ధ్వంసం.. ఆందోళనలో సింగరేణి అధికారులు





మెట్రో న్యూస్, రామకృష్ణాపూర్: ఆగస్టు 19/2026.మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ కార్మిక కాలనీలో సింగరేణి యాజమాన్యం సరఫరా చేస్తున్న గోదావరి నీటి పైపులైన్లను గుర్తుతెలియని వ్యక్తులు వరుసగా ధ్వంసం చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. కార్మికులకు తాగునీటి సరఫరా అందించే కీలకమైన పైపులైన్లను లక్ష్యంగా చేసుకుని పదేపదే ధ్వంసానికి పాల్పడుతుండటంపై సింగరేణి అధికారులు తీవ్రంగా స్పందిస్తున్నారు.స్థానిక సీహెచ్పీ నుంచి రామకృష్ణాపూర్ కార్మిక కాలనీలోకి వచ్చే గోదావరి నీటి పైపులైనును ఈ నెల మొదటి వారంలో గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో సింగరేణి సివిల్ విభాగం అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించారు.అయితే, ఈ ఘటన జరిగిన కొద్ది రోజులకే అదే ప్రాంతంలో మరోసారి పైపులైన్ ధ్వంసం కావడంతో అధికారులు తిరిగి మరమ్మతులు చేపట్టారు. తాజాగా మూడోసారి కూడా అదే పైపులైనును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో సింగరేణి యాజమాన్యం అప్రమత్తమైంది.కార్మికులకు నిరంతరాయంగా గోదావరి నీటి సరఫరా అందించేందుకు అధికారులు మరమ్మతులు చేపడుతున్నప్పటికీ, పదేపదే పైపులైన్ ధ్వంసం కావడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనలపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సింగరేణి సివిల్ సూపర్వైజర్ లవకుమార్ తెలిపారు.పైపులైన్ ధ్వంసానికి పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించేందుకు పోలీసుల సహకారంతో చర్యలు చేపడుతున్నామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## సరస్వతి ఆలయంలో పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ ప్రత్యేక పూజలు



మెట్రో న్యూస్, నిర్మల్ ప్రతినిధి:-ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న ఈయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి శేష వస్త్రంతో ఆలయ అర్చకులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట బాసర సర్పంచి వెంకటేష్ గౌడ్ ఎంపీఓ గంగా సింగ్, ఈవో ప్రసాద్ గౌడ్ లు ఉన్నారు.

## మహాగాం గ్రామం లో గోదాముల నిర్మాణానికి పది ఎకరాల స్థలం కేటాయింపు

**ధాన్యం నిల్వలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు**



మెట్రో న్యూస్, నిర్మల్ ప్రతినిధి:- రైతులు పండించిన ధాన్యం విలువలకు ఇబ్బందులు కలగకుండా నిర్మల్ జిల్లా బైంసా మండలంలోని మహగాం గ్రామంలో గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం పది ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ వెల్లడించారు. బుధవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొసీడింగ్ ను (జిల్లా కలెక్టర్ ఉత్తర్వు కాపీని) అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విఠలేశ్వర ఆలయం వెనుక ఉన్న 218 సర్వే నంబర్ లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించడం జరిగిందని, ఈ భూమిని తెలంగాణ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాముల నిర్మాణం కోసం కేటాయిస్తూ ప్రతిపాదించడం జరిగిందన్నారు. 10 ఎకరాల స్థలంలో పదివేల నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న సైంటిఫిక్ గోడౌన్స్ నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. స్థలము అప్పగించిన తర్వాత నిర్మాణం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మహాగాం సర్పంచ్ అప్పల రాజ్యలక్ష్మి రాకేష్ మాట్లాడుతూ తమ గ్రామంలో గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కు కృతజ్ఞతలు చెప్పారు. ప్రభుత్వం వేగవంతంగా గోదాముల నిర్మాణ ప్రక్రియ ప్రారంభించడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

# అర్హులైన ప్రతి నిరుపేద

# కుటుంబానికి ఇళ్ల స్థలం ఇస్తాం.

**.రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**పల్లెగూడెం సమగ్ర అభివృద్ధికి రూ.61.76 కోట్లు కేటాయించినట్లు వెల్లడి**

**పల్లెగూడెం గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి**



ఖమ్మం మెట్రో ఈవెనింగ్ ఆగస్టు -19అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలో ఉంటే, సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను గుర్తించిన వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసమే భూములను సమీకరించి ఇళ్ల స్థలాలు అందిస్తామని తెలిపారు.పల్లెగూడెం సమగ్ర వికాసానికి రూ. 61.76 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి అన్నారు. గ్రామంలో ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని, గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎన్ఎస్పీ కాల్వ గట్టుపై రూ. 5.80 కోట్లతో మోడల్ సీసీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా, పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు చెప్పారు.రూ.20 లక్షల వ్యయంతో పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేవలం రెండు నెలల వ్యవధిలోనే నాణ్యతతో పూర్తి చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి అభినందించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షలతో నూతన అంగన్వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని మంత్రి అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో 110 గ్రామ పంచాయతీ నూతన భవనాలు మంజూరై అన్ని గ్రౌండింగ్ అయి, వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అంగన్వాడీలకు నూతన భనవాల నిర్మాణం తుది దశలో ఉందన్నారు. వివో భవనాల నిర్మాణానికి 20 చోట్ల స్థల సమస్య ఉన్నట్లు, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధ్యతగా వ్యవహరిస్తూ అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఇఇ మహేష్ బాబు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, కమీషనర్ శ్రీనివాస రెడ్డి, పల్లెగూడెం సర్పంచ్ చుందూరి సుజన కృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి ప్రయోజనం అందించాలి...

**దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి**

**జాతీయ రహదారుల పనులు వేగవంతం చేసి భూసేకరణ సమస్యలను పరిష్కరించాలి**

**గురుకులాలు, పాఠశాలల్లో ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి**

**దిశా కమిటీ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పనుల పురోగతిపై సమీక్ష**



ఖమ్మం మెట్రో ఈవెనింగ్ ఆగస్టు- 19ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి కార్యక్రమం ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు.

ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఖమ్మం ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన దిశా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి నిర్వహించారు. గత దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై అధికారులు సమర్పించిన యాక్షన్ టేకన్ రిపోర్టును సమావేశంలో పరిశీలించారు.జాతీయ రహదారులు, నీటిపారుదల, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ, గిరిజన సంక్షేమం, మార్కెటింగ్, వ్యవసాయం, డీఆర్డీఏ, మహిళా శిశు సంక్షేమం, పౌరసరఫరాలు, విద్య, వైద్యం, మున్సిపాలిటీలు, మత్స్యశాఖ, తదితర శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.

ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులను కేవలం మంజూరు చేయడంతో సరిపెట్టకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పనుల అమలులో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించాలని, నిధులు లేదా అనుమతులకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వ స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకునేలా ఫాలో అప్ చేస్తామని తెలిపారు.జాతీయ రహదారుల పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన భూ సేకరణను త్వరగా పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖలో పూర్తయిన అన్ని పనులను సంబంధిత స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించాలని, ఉపాధి హామీ పనుల క్రింద మంజూరైన వీఓ భవనాల వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ఎంపీ ల్యాడ్స్ ద్వారా త్రాగునీటి కోసం మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. పనుల్లో అవసరమైన సవరణలు, మార్పులు ఉంటే సంబంధిత ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. డీఎంఎఫ్టీ నిధులను వినియోగించిన వివరాలను సమర్పించాలని, డీఎంఎఫ్టీ కమిటీ సమావేశాన్ని త్వరగా నిర్వహించి, ఇకపై సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న మౌళిక వసతుల లోటుపాట్లపై సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్కు అందించాలని ఎంపీ ఆదేశించారు. ప్రతి కేంద్రంలో మరుగుదొడ్లు, త్రాగునీరు, విద్యుత్, ఇతర ప్రాథమిక వసతులు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని, క్షేత్రస్థాయిలో గుర్తించిన ప్రతి లోటును త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్లకు అర్హత ఉన్న కుటుంబాలను గుర్తించేందుకు సర్వే నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలని అన్నారు.జిల్లాలోని అన్ని గురుకులాలు, పాఠశాలల్లో ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి ఆదేశించారు. తనిఖీల సమయంలో పాఠశాలలు, గురుకులాల పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను తప్పని సరిగా పరిశీలించాలని అన్నారు. తరగతి గదుల్లో బోధన ఎలా జరుగుతుందో కూడా గమనించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదా లేదా అనేది క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. తనిఖీలకు ముందుగా పాఠశాలలకు ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని, వాస్తవ పరిస్థితులను తెలుసుకునేలా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం పిల్లల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నందున ఆ నిధుల ప్రయోజనం క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిశితంగా పర్యవేక్షించాలని ఎంపీ అన్నారు. బ్లాక్ మార్కెటింగ్కు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఎక్కడెక్కడ బ్లాక్ మార్కెటింగ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయో గుర్తించి, సంబంధిత ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి అక్రమాలకు పాల్పడే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో అమృత్ 2.0 నిధులతో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీ అన్నారు. పనులకు అవసరమైన భూ కేటాయింపులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. అన్ని మున్సిపాలిటీల్లో డ్రైనేజీ, త్రాగునీటి పనులను వేగవంతం చేయాలని,ముఖ్యంగా విలీన ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.ఖమ్మం రైల్వే స్టేషన్లో పార్కింగ్ సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రైల్వే భూముల మార్పిడి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. ఖమ్మం రైల్వే స్టేషన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి డిసెంబర్ 2026లోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ల్యాండ్ డెవలప్మెంట్ మాస్టర్ ప్లాన్కు త్వరగా ఆమోదం పొందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరంగల్-- ఖమ్మం గ్రీన్ఫీల్డ్ హైవే పనులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో కొత్త విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ప్రభుత్వం కొత్త విధానం తీసుకువచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఒక కిలోమీటర్ లోపు దూరంలో విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటే చార్జీలు ఉచితంగా ఉంటాయని, మీటర్ కోసం డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో కొత్త విద్యుత్ కనెక్షన్లకు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.జిల్లాలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన క్రింద 70,620 గ్యాస్ కనెక్షన్లు అందించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 4.73 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, బయో మెట్రిక్ విధానం ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. గత ఏడాది కాలంలో కొత్త రేషన్ కార్డులు జారీ చేసి రెండు లక్షల మందికి పైగా లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు.అంగన్వాడీ కేంద్రాల్లో 100 శాతం మరుగుదొడ్లు, త్రాగునీరు, విద్యుత్, ఇతర ప్రాథమిక వసతులు కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన లోటుపాట్లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని వివరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, నామినేటెడ్ సభ్యులు, జిల్లా అధికారులు, సర్పంచులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 27న ఖమ్మంలో జరిగే ఉద్యోగ ఉపాధ్యాయుల మహా ధర్నాను జయప్రదం చేయండి

**ఖమ్మం జిల్లా జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు అనుమోలు కోటేశ్వరరావు, కంచర్ల శ్రీనివాసరావు**

మెట్రో న్యూస్ ఎర్రుపాలెం (ఆగస్టు 19):-మండలంలో జరుగుతున్నటువంటి టిసి కాంప్లెక్స్ ను ఉద్యోగుల ఉపాధ్యాయుల జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు అనుమోలు కోటేశ్వరరావు,కంచర్ల శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై 2023 నుండి ఇవ్వాల్సినటువంటి రెండవ పిఆర్సి రిపోర్టును తెప్పించుకొని వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న ఆరు డిఏలను వెంటనే మంజూరు చేయాలని, ఈ కుబేర్ లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయ ఉద్యోగ డిమాండ్లను అంగీకరించని పక్షంలో తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయుల ఐక్యవేదిక జేఏసీ తరపున ఈ నెల 27వ తేదీన జిల్లా కేంద్రాలలో, సెప్టెంబర్ 10వ తేదీన హైదరాబాద్ లోనూ మహాధర్నా చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.జిల్లా, హైదరాబాదు లో జరుగు మహాధర్నాలలో ఉద్యోగులు ఉపాధ్యాయులు వేలాదిమందిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఉద్యోగులు ఉద్యమాలను బలపరిచి తమ హక్కుల్ని కాపాడుకోవాలని కోరారు.ఈ సమావేశం లో టీఎస్ యుటిఎఫ్ బాధ్యులు సుబ్బరామరాజు, సత్యనారాయణ,ఎస్ వెంకమ్మ,పుల్లయ్య, శంకర్,పిడి నాగేశ్వరరావు, నాగరాజు,బాబి,లక్ష్మి, తిరుపతమ్మ, పీఆర్టీయూ బాధ్యులు రమేష్,రాఘవ,భవాని, నాగమణి,తదితరులు పాల్గొన్నారు.

## ఒక ఫోటో వేల మధుర జ్ఞాపకాలకు ప్రతీక

**మండల ఫోటోగ్రఫీ అధ్యక్షుడు పరమేష్.**



మెట్రో న్యూస్,ఏన్కూరు,ఆగస్టు 19 : ఒక ఫోటో వేల మధుర జ్ఞాపకాలకు ప్రతీక అని మండల ఫోటోగ్రఫీ అధ్యక్షుడు బీరెల్లి పరమేష్ అన్నారు. బుధవారం ఏన్కూర్లో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫోటోగ్రఫీ రంగంలో ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. మారుతున్న సమాజంలో జరిగే ప్రతి చారిత్రక ఘట్టాన్ని మధుర జ్ఞాపకాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరి రామారావు, బాల భక్తుల శివకుమార్, భూక్య జగన్, సైదా, బానోత్ గోపికృష్ణ, సుధాకర్, సందీప్ కుమార్, సింగం నేటి నరేష్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా..

## జీఓను రద్దు చేయాలని డిమాండ్!



మెట్రో న్యూస్ మధిర (ఆగస్టు 19):-తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యను ఐటీఐ స్కిల్ యూనివర్సిటీలలో విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన శక్తి స్కీమ్ మరియు సంబంధిత జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మధిర పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి మధిర పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను ఇతర సంస్థల్లో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు నష్టం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే 'శక్తి స్కీమ్'ను, సంబంధిత జీఓను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ ఆందోళనలో విద్యార్థులు, ఎస్ ఎఫ్ ఐ నాయకులు పాల్గొన్నారు....

## మోడల్ సోలార్ గ్రామంగా చెరువుమాధారం..

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



మెట్రో ఈవెనింగ్ నేలకొండపల్లి ఆగస్టు-19జిల్లాలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడంతో పాటు, పేద కుటుంబాల విద్యుత్ అవసరాలను మరింత సమర్థవంతంగా తీర్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమంలో భాగంగా నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామాన్ని పైలట్ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.బుధవారం చెరువుమాధారం గ్రామంలో గృహాలకు ఏర్పాటు చేసిన 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్టాప్ సోలార్ ప్యానెళ్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్తో కలిసి మంత్రి ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ వ్యవస్థను పరిశీలించి, లబ్ధిదారులతో మంత్రి మాట్లాడారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదింటి ఆడబిడ్డలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలన్న హామీ మేరకు గృహజ్యోతి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు.గృహాలకే పరిమితం కాకుండా రైతుల వ్యవసాయ మోటార్లకు కూడా సౌర విద్యుత్ అందించే దిశగా చెరువుమాధారాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశామని మంత్రి తెలిపారు. 10 హెచ్పి సామర్థ్యం కలిగిన వ్యవసాయ మోటార్లకు సోలార్ విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.గృహాలకు సౌర విద్యుత్, రైతుల వ్యవసాయ మోటార్లకు సౌర విద్యుత్ అందించడం ద్వారా చెరువుమాధారం గ్రామాన్ని సమగ్ర మోడల్ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, చెరువుమాధారం గ్రామంలో మొత్తం 966 గృహజ్యోతి కనెక్షన్లు ఉన్నాయని, అందులో ప్రాథమికంగా 713 ఇళ్లను మోడల్ సోలార్ గ్రామం పథకం కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు అవసరమైన రూఫ్టాప్, స్లాబ్ వంటి నిర్మాణ సదుపాయాలను పరిశీలించి ఇళ్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. మిగిలిన ఇళ్లలో కూడా అవసరమైన ప్రత్యామ్నాయ నిర్మాణాలపై సాంకేతికంగా పరిశీలించి, సాధ్యమైన మేరకు అందరికీ సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.అనంతరం మంత్రి బుద్దారం గ్రామంలో రూ. 197 లక్షల వ్యయంతో బుద్దారం నుండి రాజారాంపేట వరకు, కొంగర గ్రామంలో రూ. 105 లక్షల వ్యయంతో కొంగర నుండి పాలేరు వాగు వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేశారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసా చారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఇ యుగంధర్ రావు, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో ఎర్రయ్య, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మెట్రో
జిల్లాలు
పెద్దపల్లి
జగిత్యాల
సిరిసిల్ల
# ఉమ్మడి కరీంనగర్
5
హైదరాబాద్ గురువారం ఆగస్టు 20 2026

## పెద్దపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో 20న వాహనాల బహిరంగ వేలం

మెట్రో న్యూస్ పెద్దపల్లి. పెద్దపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి జప్తు చేసిన ఐదు వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఆగస్టు 20న ఉదయం 11 గంటలకు బండారికుంటలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అదే రోజు ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ధరావత్తు (ఈఎండీ) సొమ్ము డిపాజిట్ చేసి రసీదు పొందాలని సూచించారు. ఉదయం 11 గంటలకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సమక్షంలో వేలం ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. వాహనాలు తెలంగాణ ఎక్సైజ్ చట్టం, 1968లోని 46(2), తెలంగాణ ప్రొహిబిషన్ చట్టం, 1995లోని 13(2) సెక్షన్ల ప్రకారం ప్రభుత్వానికి జప్తు చేసినవని వివరించారు. మరిన్ని వివరాల కోసం కార్యాలయ పని వేళల్లో పెద్దపల్లిలోని మద్య నిషేధ, ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని నాగేశ్వరరావు సూచించారు.

## పోచమ్మవాడలో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

కరీంనగర్ మెట్రో న్యూస్ కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 39వ డివిజన్ పోచమ్మవాడలో ఖ×ణఖీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు డ్రైన్ నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోచమ్మవాడలో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు, పారిశుద్ధ్య పరంగా మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ



కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావ్, కార్పొరేటర్లు మాసం గణేష్, తాటి ప్రభావతి, బండ రమణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, దేవసాని సరస్వతి సత్యనారాయణ, గాజా రామ శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, కో-ఆప్షన్ సభ్యులు బల్బీర్ సింగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం గారు, ఈస్ట్ జోన్ నాయకులు, పార్టీ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## రాముని గుండాల కొండపై 21న సామూహిక వరలక్ష్మి వ్రతం



మెట్రో న్యూస్ రామగుండం, రాముని గుండాల కొండపై ఉన్న చారిత్రక ప్రాధాన్యత కలిగిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం (శ్రీరామపాద క్షేత్రం)లో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న సామూహిక శ్రీ వరలక్ష్మి వ్రతం, కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మేడి తిరుపతి తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొనే భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచితంగా శ్రీ లక్ష్మీదేవి డాలర్ (ప్రతిమ), పూజా ద్రవ్యాలు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పవిత్రమైన శ్రావణ శుక్రవారం రోజున నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతం, కుంకుమ పూజల్లో మహిళలు, భక్తులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. భక్తులు సకాలంలో ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొని శ్రీ వేంకటేశ్వర స్వామివారి, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహం పొందాలని కోరారు.

## అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన

**మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్**

**విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఆటబొమ్మలను అందజేసిన చైర్ పర్సన్**



జగిత్యాల జిల్లా/కోరుట్ల, ఆగస్టు 19 (మెట్రో న్యూస్) : అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన ను ప్రభుత్వ పాఠశాలలో బోధిస్తున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ అన్నారు. బుధవారం కోరుట్ల పట్టణ కల్లూర్ రోడ్డులో గల గడి ప్రీ ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం పంపించిన పాఠ్యపుస్తకాలు, ఆట బొమ్మలను కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేష్ గడి ప్రీ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నునావత్ రాజు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ గంగాధర్ లతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లు విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, ఆట బొమ్మలను పంపిణీ చేశారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పించిందని ఉచిత యూనిఫాంలో ఉచిత పాఠ్యపుస్తకాలు మధ్యాహ్న భోజనం అందిస్తూ విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన చేయడం జరుగుతుందని, కావున ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ వెడ్డింగ్ విభాగంలో వీరేశంకు ద్వితీయ బహుమతి



మెట్రో న్యూస్ ఓదెల. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో ఓదెల మండలం జీలకుంట గ్రామానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ ఇరుకుల్ల వీరేశం ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించారు. ఫోటోగ్రాఫర్లలోని సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో నిర్వహించిన ఈ పోటీలను కల్చర్, వెడ్డింగ్, ప్రీ వెడ్డింగ్ అనే మూడు విభాగాల్లో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ఫోటోగ్రాఫర్లు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రీ వెడ్డింగ్ విభాగంలో ఇరుకుల్ల వీరేశం తన అత్యుత్తమ ఫోటోగ్రఫీ ప్రతిభతో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. బహుమతితో పాటు రూ.5,000 నగదు పురస్కారాన్ని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీలో బహుమతి సాధించడం పట్ల వీరేశం హర్షం వ్యక్తం చేశారు. తనను ప్రోత్సహించిన ఫోటోగ్రాఫర్లు, స్నేహితులు, పోటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఫోటోగ్రాఫర్లు, స్నేహితులు ఇరుకుల్ల వీరేశంను అభినందించారు.
కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ (దిలీప్), మాజీ మున్సిపల్ చైర్మన్ తకాళ్లపల్లి రాజేశ్వరరావు, స్థానిక ఎస్సై రవి, ఫోటోగ్రఫీ మాస్టర్లు అనిల్‌కుమార్, శివకుమార్, పీవీఎస్ నాగరాజు, మండల అధ్యక్షులు ముస్తఫా, రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



సైదాపూర్ మెట్రో న్యూస్ : మండలంలోని దుద్దెనపల్లిలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి రాజ్ గోపాల్‌తో కలిసి ఉపకేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో విద్య, వైద్యం, మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ద్వారా ఫోటోగ్రాఫర్లకు ప్రత్యేకమైన గుర్తింపు

కరీంనగర్, మెట్రోన్యూస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వివిధ పత్రికల ఫోటోగ్రాఫర్లకు ఆత్మీయ సత్కారం చేసిన "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి ఫోటోగ్రఫీ ఒక గొప్ప కళ మాత్రమే కాకుండా, తరతరాలుగా కొనసాగుతున్న ఒక ప్రత్యేకమైన వృత్తి అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి గారు స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ దినపత్రికల ఫోటోగ్రాఫర్లకు ఏర్పాటు చేసినటువంటి ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు అన్నారు. ఫోటోగ్రఫీ ద్వారా మధురానుభూతులను, మరపురాని జ్ఞాపకాలను జీవితాంతం పదిలపరుచుకోవచ్చని, సమాజంలో ఎన్నో మంచి మార్పులకు ఫోటోగ్రఫీ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫోటోగ్రఫీకి ఎంతో గొప్ప చరిత్ర ఉందని, కాలానుగుణంగా ఫోటోగ్రఫీలో అనేక సాంకేతిక మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, ఒక క్షణాన్ని శాశ్వత జ్ఞాపకంగా మలిచే దాని ప్రాధాన్యత మాత్రం ఎప్పటికీ తగ్గదని అన్నారు. ఒక మంచి ఛాయాచిత్రం ఒక సంఘటనను, ఒక భావోద్వేగాన్ని, భవిష్యత్ తరాలకు కళ్లకు కట్టినట్లు చూపించగలదని చెప్పారు.
ఆత్మీయ సత్కారం పొందిన వారిలో సుకూర్, శైలేందర్ రెడ్డి గారు, కిరణ్ గారు, జనార్దన్ గారు, మోసిన్, శ్రీధర్ గారు, రంజిత్ మరియు తదితరులు ఉన్నారుఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**ఎస్ఐఆర్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం**

**హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**




రాజన్న సిరిసిల్ల, ఆగస్టు -19మెట్రో న్యూస్ రాజన్న సిరిసిల్ల ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ) ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ), అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి హాజరయ్యారు. జిల్లాలవారీగా అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కింద అన్ని జిల్లాల్లో అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు డౌన్లోడ్ చేసి ఓటర్లకు అందజేయాలని ఆదేశించారు. నోటీసులో ఓటర్ సమాధానము అందించేందుకు తేదీ, సమయం, స్థలం వివరాలు ఇవ్వాలని సూచించారు. ఒక కుటుంబం ఓట్లు అన్ని అదే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఫారం 6, 7, 8 దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. ఏ ఎస్ డీ డీ జాబితా ను మరోసారి తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. జిల్లాల్లో చేపడుతున్న చర్యలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, రాష్ట్ర స్థాయికి పంపాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సులభంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు.
నోటీసుల జారీ, క్లెయిమ్‌లు--అభ్యంతరాల పరిష్కారం వంటి ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ, నిర్ణీత కాలపరిమితిలో ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**నోటీసులు జారీ చేసేందుకు ఏర్పాట్లు..**

ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కింద జిల్లాలో 5,008 నో మ్యాపింగ్ ఓటర్లు, 78,833 అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసేందుకుఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. ఆర్డీవోలు తమ పరిధిలోని బీఎల్ఓలకు నోటీసులు జారీ, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వాలని ఇప్పటికే తెలియజేశామని వివరించారు. ఒక షెడ్యూల్ సిద్ధం చేసి.. దానికి అనుగుణంగా ముందుకు వెళ్తామని వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.
సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్బంధిస్తే నిజాలను దాయలేరు - కల్వకుంట్ల గోపాల్ రావు

**నిర్బంధిస్తే నిజాలను దాయలేరు - కల్వకుంట్ల గోపాల్ రావు**



ముస్తాబాద్, ఆగస్ట్ 19(మెట్రో ఈవినింగ్):ముస్తాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బొంపల్లి సురేందర్ రావు ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. మాజీ రైతు బంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు మాట్లాడుతూ టీమ్స్ హాస్పిటల్ కు సందర్శించుట కొరకు పిలుపునిచ్చిన సందర్భంలో మాజీ మంత్రివర్యులు హరీష్ రావుని కోకాపేటలోని నివాసంలో హౌస్ అరెస్ట్ చేయడాన్ని ముస్తాబాద్ మండలం భారత రాష్ట్ర సమితి పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాము. ప్రభుత్వ ఆసుపత్రిల్లోని వైఫల్యాలు బయట పడుతాయి అనే నేపథ్యంలోనే హరీష్ రావు ని హౌస్ అరెస్టు చేశారని ఆరోపించారు. నర్సంపేటలో అర్ధరాత్రి - సర్కార్-పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి - విగ్రహాన్ని తొలగించడాన్ని ముస్తాబాద్ మండల భారత రాష్ట్ర సమితి పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని ఇదేవిధంగా మీరు ప్రజావ్యతిరేకత విధానాలతో వెళితే తప్పకుండా మీకు ప్రజలు వారి భాషలోనే బుద్ధి చెబుతారని తెలియజేస్తు! అబద్ధం పునాదుల పైన వచ్చిన కాంగ్రెస్ పార్టీ వైఖరిని విధానాలను గమనించగలరని ప్రజలను కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ముస్తాబాద్ మాజీ పట్టణ అధ్యక్షులు రాచమడుగు సంతోష్ రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మెంగాని మనోహర్. ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు శీలం స్వామి, నాయకులు కోడె శ్రీనివాస్, జాంగిర్,శివ కేశవ ఆలయ చైర్మన్ శేరయ్య,యూత్ నాయకుడు మీడిదొడ్డి యాదగిరి, పల్లె సత్యం గౌడ్, బిఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఇల్లందకుంట ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం...



ఇల్లందకుంట మెట్రో న్యూస్;తేదీ 19 ఆగస్టు 2026 రోజున ఇల్లందకుంట ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ను గ్రామ సర్పంచ్ దారా సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దార సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవం కలిగిన ఉపాధ్యాయుల బోధనతో పాటు ఎఫ్ఎల్ఎన్, ఏఎక్స్ఎల్,ఏఐ కార్యక్రమంలో భాగంగా ఏఎల్ఎల్ , ఏఎంఎల్ కార్యక్రమంలో తెలుగు ,ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టులలో విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంచడం కొరకు విద్యార్థులు ఇంటరాక్టివ్ ఆడియో విజువల్ పాఠాలను ఏఐ ఆధారంగా విద్యార్థులు కంప్యూటర్లో పాఠాలు నేర్చుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారా సురేష్, మండల విద్యాధికారి కే .రాములు ,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తస్లీమ్ నజ్నీన్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె గోపి,ఉపాధ్యాయులు ,బి వరలక్ష్మి , సార్ల సంపత్, సతీష్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సిరిసిల్ల జిల్లా విశ్వకర్మ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అరుణ్ తేజ చారి



సిరిసిల్ల జిల్లా విశ్వకర్మ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బ్రహ్మశ్రీ దూరిశెట్టి అరుణ్ తేజ చారిని నియమించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మశ్రీ నోండ్ల సంతోష్ చారి ఆధ్వర్యంలో, రాష్ట్ర ఈసీ మెంబర్ బ్రహ్మశ్రీ కానసల అరుణ్ చారి సమక్షంలో ఈ నియామకం జరిగింది. దుర్శెట్టి అరుణ్ తేజ చారి ఎన్నో సంవత్సరాలుగా సంఘ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సేవలందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. విశ్వబ్రాహ్మణ సమాజ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నూతన బాధ్యతలు స్వీకరించిన అరుణ్ తేజ చారికి పలువురు విశ్వకర్మ సంఘం నాయకులు, సభ్యులు అభినందనలు తెలిపారు.

# ఆహార భద్రత చట్టం అమలులో నిర్లక్ష్యం వద్దు.

### రేషన్,పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ఫుడ్ కమిషన్ తనిఖీలు

### అర్హులందరికీ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందించాలన్న ఫుడ్ కమిషన్ చైర్మన్.



నాగర్ కర్నూల్ బ్యూరో (మెట్రో న్యూస్:ఆగస్టు 19) జాతీయ ఆహార భద్రత చట్టం 2013ను పకడ్బందీగా అమలు చేసి అర్హులందరికీ ప్రయోజనాలు అందించాలని తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.బుధవారం కల్వకుర్తి మండలంలో రేషన్ దుకాణం, ప్రభుత్వ పాఠశాల,అంగన్‌వాడీ కేంద్రాలు,గురుకుల పాఠశాలలను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు.రేషన్ దుకాణాల్లో స్టాక్, పంపిణీ, లబ్ధిదారుల జాబితాలు తనిఖీ చేయాలని,పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యత, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, అంగన్‌వాడీల్లో చిన్నారులు, గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారం సకాలంలో అందించాలని ఆదేశించారు. గుడ్ల నాణ్యతలో లోపాలు సరిదిద్దాలని సూచించారు.ఫుడ్ కమిషన్ సూచనలు పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు.

## రాష్ట్రానికే ఆదర్శంగా ఉప్పునుంతల పీఏసీఎస్



మెట్రో న్యూస్:-(ఉప్పునుంతల,ఆగస్టు 19)తెలంగాణ రాష్ట్రానికే ఉప్పునుంతల పీఏసీఎస్ ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీస్, అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఐఏఎస్) సురేంద్రమోహన్ అన్నారు. రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పీఓ), పీఏసీఎస్ సంయుక్త సమన్వయంతో ఏర్పాటు చేసిన వేరుశనగ డికార్డికేటర్‌ను బుధవారం ఆయన సందర్శించి అభినందించారు. ఈ సందర్భంగా సురేంద్రమోహన్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మెరుగైన ధరలు లభించేలా, చిన్న, సన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 620 ఎఫ్‌పీఓలు ఉన్నాయని, ప్రస్తుతం వాటి మొత్తం టర్నోవర్ సుమారు రూ.5 వేల కోట్లు ఉందని తెలిపారు. రానున్న రెండేళ్లలో ఈ టర్నోవర్‌ను రూ.10 వేల కోట్లకు పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.అదేవిధంగా డికార్డికేటర్ ప్రాంతంలోనే అన్ని సౌకర్యాలతో పామ్ ఆయిల్ కలెక్షన్ పాయింట్ ఏర్పాటు చేయడానికి డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్‌కు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే తొలి పామ్ ఆయిల్ కలెక్షన్ పాయింట్‌గా ఉప్పునుంతల పీఏసీఎస్ రికార్డు సృష్టించనుందని అనంతరం ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. వేరుశనగ డికార్డికేటర్ ఏర్పాటుకు కృషి చేసిన పీఏసీఎస్ చైర్మన్, సీఈఓ, స్థానిక నాయకులు, రైతులను ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో డీసీఓ రఘునాథరావు, పీఏసీఎస్ చైర్మన్ మద్దు నరేందర్ రెడ్డి, సీఈఓ కొత్త రవీందర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, స్థానిక సర్పంచ్ చింతగల శ్రీనివాసులు, పీఏసీఎస్ సిబ్బంది,జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర శేఖర్,మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్,అమ్రాబాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలి - అలంపూర్ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్





ఆగస్టు 19 మెట్రో న్యూస్‌వడ్డేపల్లి :తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని,రైతుల పంటలు పండాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపు మేరకు అలంపూర్ మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వరుణ యాగ పాదయాత్ర ఘనంగా ప్రారంభమైంది.శాంతినగర్ లోని ఈశ్వరమ్మ గుడి నుంచి ప్రారంభం బుధవారం ఉదయం 11:29 గంటలకు శాంతినగర్ లోని ఈశ్వరమ్మ గుడి -- రవీంద్ర హైస్కూల్ వద్ద కృష్ణ, తుంగభద్ర నదుల జలాలతో ప్రత్యేకపూజలునిర్వహించారుఅక్కడి నుంచిప్రారంభమైన పాదయాత్ర జులేకల్ శివాలయం -- ఆర్డీఎస్ కాలువ వరకు కొనసాగింది.భారీగా పాల్గొన్న రైతులు, కాంగ్రెస్ శ్రేణులుఈ పాదయాత్రకునియోజకవర్గంలోని రైతులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, మహిళలు,అభిమానులు పెద్ద సంఖ్యలోపాల్గొనిసంఘీభావం తెలిపారు.

“తెలంగాణ సుభిక్షంగా ఉండాలి -- ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి”బి అనే సంకల్పంతో ఈపాదయాత్రనిర్వహిస్తున్నామని డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ తెలిపారు. తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులందరూ సంతోషంగా ఉండాలని భగవంతుడినిప్రార్థించామనిఅన్నారు.ఈకార్యక్రమంలోఅలంపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు, రైతులుపెద్ద ఎత్తున పాల్గొన్నారు. రైతుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి వస్తున్న స్పందన పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి

## మక్తల్- వనపర్తి బస్ సర్వీసులను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి



ఆత్మకూరు మండలం మెట్రో న్యూస్ మొత్తం నుంచి వనపర్తికి వాయ కురుమూర్తి మీదిగా వెళ్లే నూతన బస్ సర్వీసులను మంత్రి వాకిటి శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు విద్యార్థులు ఉద్యోగులు వనపర్తికి రాకపోకలు సాగించేందుకు ఈ బస్సు సర్వీసు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే విద్యార్థులకు అనుకూలంగా ప్రజా రవాణా సౌకర్యాలను మరింత విస్తరింప చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మక్తల్ నియోజకవర్గం లో ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడం తో పాటు ఆర్టీసీ సౌకర్యాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని మంత్రి శ్రీహరి తెలిపారు కొత్త బస్సు సర్వీసు ప్రారంభం కావడంతో మక్తల్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు

## గండీడ్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం విజయవంతం

### ఎఫ్‌ఎల్‌ఎన్ అమలుతో విద్యార్థుల ప్రాథమిక సామర్థ్యాల పెంపుపై దృష్టి



మెట్రో న్యూస్ గండీడ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ప్రారంభమైంది. మండల విద్యాధికారి రుద్రారం జనార్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలపై పట్టు పెంచాలని సూచించారు.ఎఫ్‌ఎల్‌ఎన్‌లోని అన్ని అంశాలను సమర్థంగా అమలు చేయాలని, ప్రతిరోజూ గంటపాటు రెమిడియల్ తరగతులునిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో వెన్నచేడ్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవి బాబు, గండీడ్ బాలికల పాఠశాల హెచ్‌ఎం తిరుపతమ్మ, ఆర్‌పీలు శ్రీనివాస్, వాసంతి, ప్రధానోపాధ్యాయులు కిషన్, లక్ష్మణ్, శ్రీనివాస్, అంగడి అరుణదేవి, మంజుల, భారతి పాల్గొన్నారు.టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, టీపీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, సీపీఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, టీజీయూఎస్ అధ్యక్షుడు రవీందర్ నాయక్ తదితరులు హాజరయ్యారు.

## బీచుపల్లిని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



జోగులాంబ గద్వాల, ఆగస్టు 19(మెట్రో న్యూస్) :బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆలయ ప్రాంగణానికి చేరుకున్న కలెక్టర్ కు మొదట ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో, మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయ స్వామి ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు కలెక్టర్ ను సన్మానించి, ప్రసాదాన్ని అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి పురంధర్ బీచుపల్లి క్షేత్ర విశిష్టతను కలెక్టర్ కు తెలియజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆలయ ప్రాంగణం పరిశీలించి భక్తులను ఆకట్టుకునేలా లైటింగ్, ఇతర అలంకరణ చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో చెత్తాచెదారం, పందులను గమనించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రత కోసం అవసరమైన సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మినీ పార్క్, ఫౌంటెన్‌ను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా నిర్వహించాలన్నారు. పరిసరాల్లో ఉన్న ఫంక్షన్ హాళ్లను నిబంధనల ప్రకారం నిర్వహించేలా చూడాలన్నారు. ఆలయ పరిసరాల్లోని హోటళ్లను నిబంధనల ప్రకారం అవసరమైన ప్రమాణాలతో నిర్వహించాలన్నారు. నిజాం కొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను పర్యాటక శాఖకు పంపించడం జరిగిందన్నారు. నదీతీరంలో సేవలందిస్తున్న గజ ఈతగాళ్లకు లైఫ్ జాకెట్లు, టార్చిలైట్లు, రక్షణ తాళ్లు, రెస్క్యూ బోట్ వంటి పరికరాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పర్యటనలో తహసీల్దార్ నరేష్, ఈఓ పురేందర్, పంచాయితీ కార్యదర్శి అరుణ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రకు సజీవ సాక్ష్యం తరతరాల జ్ఞాపకాల వారధి ఫోటోలు

### సృజనాత్మకతతో సమాజాన్ని చైతన్యపరిచే శక్తి ఫోటోగ్రఫీ

### ఒక్క ఫోటో వెయ్యి మాటల నిజాన్ని చూపించే శక్తి ఫోటో జర్నలిజానిదే

### జిల్లా ఎస్పీ సునీత రెడ్డి



వనపర్తి మెట్రో న్యూస్ఒక్క ఫోటో వెయ్యి మాటల భావాన్ని చెబుతుంది ఒక క్షణాన్ని శాశ్వత జ్ఞాపకంగా నిలుపుతుంది.. ఒక తరానికి చెందిన చరిత్రను మరో తరానికి అందిస్తుంది. సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ఎలాంటి అలంకరణ లేకుండా ప్రజల కళ్లముందుంచే శక్తి ఫోటో జర్నలిజానిదని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు.బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో ఫోటో జర్నలిస్ట్ లతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించి ఫోటో జర్నలిస్టులకు శుభాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒక్క ఫోటో వెయ్యి మాటలకు సమానం. ఒక క్షణాన్ని బంధించే కెమెరా.. ఆ క్షణాన్ని చరిత్రగా నిలబెట్టే శక్తిని కలిగి ఉంటుంది. సమాజంలో జరిగే ప్రతి సంఘటనకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తూ, నిజాన్ని ఎలాంటి భేషజం లేకుండా ప్రజల కళ్లముందుంచే శక్తివంతమైన మాధ్యమం ఫోటో జర్నలిజం ఫోటోగ్రఫీ కేవలం ఒక కళ మాత్రమే కాదు.. అది చరిత్రను భద్రపరిచే బాధ్యత, సమాజాన్ని ప్రతిబింబించే అద్దం, వాస్తవాలను వెలుగులోకి తెచ్చే ఆయుధం. మన సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక మార్పులు, ప్రజల జీవన విధానం, కీలక సంఘటనలు.. ఇవన్నింటినీ భావితరాలకు అందించే సజీవ దస్తావేజులు ఛాయాచిత్రాలు. ఒక మంచి ఫోటోలో ఒక కథ ఉంటుంది.. ఒక భావోద్వేగం ఉంటుంది.. ఒక సందేశం ఉంటుంది.. ఒక చరిత్ర ఉంటుందన్నారు. ముఖ్యంగా ఫోటో జర్నలిస్టులు ప్రతికూల పరిస్థితుల్లోనూ సంఘటనలను ప్రజల ముందుకు తీసుకురావడంలో చేస్తున్న కృషి అభినందనీయ మనీ సందర్భంగా అన్నారు. ముఖ్యంగా సమాజానికి వాస్తవాలను చూపిస్తూ ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించడంలో వారి పాత్ర ఎంతో కీలకమని,ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటో జర్నలిస్టులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మీ కెమెరా ఎల్లప్పుడూ నిజాన్ని బంధిస్తూ.. సమాజానికి స్ఫూర్తినిచ్చే చిత్రాలను ఆవిష్కరించాలని ఆకాంక్షించారు

ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, డిసిఆర్బి డిఎస్పి, బాలాజీ నాయక్, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు, అన్ని పత్రికల ఫోటో జర్నలిస్టులు, రాము,జ్ఞానమూర్తి,వినోద్ బాలరాజు, యూసుఫ్ యాదిరెడ్డి, లోకేష్, శ్రీకాంత్, మహేష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



తాడూర్:--- (మెట్రో న్యూస్: ఆగస్టు 19) తాడూర్ మండలం యాత్మతాపూర్ గ్రామ సమీపంలోని సాళ్లలో సాగు చేసిన పత్తి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి డి. సందీప్ కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి జి. మానస బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి పంట సాగులో రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.ప్రస్తుతం వాతావరణంలో వేడి తీవ్రత అధికంగా ఉండటంతో పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అందువల్ల రైతులు పంటను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ పురుగుల ఉధృతిని గుర్తించిన వెంటనే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.పత్తి పంటలో కలుపు మొక్కలు పెరగకుండా విధిగా కలుపు నివారణ చర్యలు చేపట్టాలని, అలాగే పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చీడపీడల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రసం పీల్చే పురుగుల నివారణకు వ్యవసాయ శాఖ సూచించిన మోతాదులో అసిఫేట్, అసిటామిప్రిడ్, ఇమిడాక్లోప్రిడ్ వంటి పురుగుమందులను అవసరాన్ని బట్టి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే పత్తి పంటలో చీడపీడల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడంతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చని అధికారులు తెలిపారు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



ఆత్మకూరు మండలం మెట్రో న్యూస్ ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్ రే,చిత్రపటానికి గాంధీ చౌరస్తాలో గాంధీ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు అదేవిధంగా ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరాములు మన్నెం ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శి మహమ్మద్ తౌఫిక్ కోశాధికారి ప్రేమ్ వెంకీ ఆత్మకూరు మండలం ఫోటోగ్రఫీ సభ్యులు వారితో పాటు తదితరులు పాల్గొన్నారు

## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

మెట్రో న్యూస్ రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడ ఎస్.పీ. పెట్రోల్ పంపు సమీపంలో జాతీయ రహదారి చీఎ-44 పక్కన సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. మహిళ మృతదేహం అనుమానాస్పద స్థితిలో ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని స్థానిక ఎస్సై తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు లేదా ఆమె కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రాజాపూర్ పోలీసులనుసంప్రదించాలని,పోలీసులుకోరారు.మహిళ,మృతదేహాన్నిగుర్తించేందుకు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులోవెల్లడికానున్నాయి.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### సర్పంచులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

### ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి




మెట్రో న్యూస్ కొల్చారం: గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీలకు అతీతంగా ముందుకెళ్తామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం కొల్చారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. మండల పరిషత్ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై తమ శాఖ పరిధిలోని సమస్యలపై సమగ్ర వివరాలు అందించాలని అన్నారు. సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులకు మెమోలు జారీ చేసి బాధ్యతాయుతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ సమస్యలు, లూజ్ లైన్లు, వీధి దీపాల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.రైతులకు అవసరమైన ఎరువులు, యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సమావేశంలో సర్పంచులు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు, అంగన్వాడీ భవనాలు, పింఛన్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సర్పంచులకు సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

సమావేశంలో ప్రత్యేక అధికారి డీఈఓ రాజు, తహసీల్దార్ శ్రీనివాస్ చారి, ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, సర్పంచులు సహకార సంఘం చైర్మన్లు , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే నా బలం -ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



మెట్రో న్యూస్ కొల్చారం: మండల కేంద్రంలోని బాబా ఫంక్షన్ హాల్లో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గౌరీ శంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యే గా కొనసాగుతున్నానంటే అందుకు బీఆర్ఎస్ కార్యకర్తలే ప్రధాన కారణమని అన్నారు. కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటానని, అవసరమైతే అర్ధరాత్రి అయినా వారి వద్దకు వచ్చి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. మీరే నా బలం మీరే నా ధైర్యం అని కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఎమ్మెల్యే విమర్శించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కార్యకర్తలు పార్టీకి వెన్నుముకలాంటి వారని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్ కుమార్ మండల యూత్ అధ్యక్షులు సంతోష్ రావు సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు యాబన్నగారి రవితేజ రెడ్డి, సర్పంచులు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### సిఐటియు వట్టుపల్లి మండల్ కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్



మెట్రో న్యూస్ జోగిపేట్.పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా సి.ఐ.టి.యు. వట్టుపల్లి మండల్ కార్యదర్శి కామ్రేడ్ ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయితీల్లో సుమారు 53,000 మంది గ్రామ పంచాయితీ ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారు. గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ పంచాయతీ కార్మికులు సేవలందిస్తున్నారు. అటువంటి పారిశుద్ధ్య కార్మికులు ఏళ్ళ తరబడి పని చేసినా పనికి భద్రత, పర్మినెంట్, కనీస వేతనాలు, పి.ఎఫ్. ఇ.ఎస్.ఐ, ప్రమాద బీమా లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పంచాయితీ కార్మికులందరిని పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినప్పటికీ అధికారం చేపట్టి రెండున్నర సం॥రాలు గడిచిన పంచాయతీ కార్మికుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేద నీ సమస్యలు పరిష్కరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు భీమయ్య, మహేష్ జిపి కార్మికుల మండలం నాయకులు ఎర్రోళ్ల దుర్గయ్య, ్పు దుర్గయ్య, లాలయ్య, దుర్గేష్, శ్రీకాంత్, గొల్ల యాదయ్య, రాజు. సప్న ,గంగమణి, తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ



మెట్రో న్యూస్,జహీరాబాద్,ఆగస్టు 19:వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ బుధవారం జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్, టౌన్ సర్కిల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, బ్యారక్స్ను పరిశీలించారు.పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, సీసీటీఎన్ఎస్–2.0తో పాటు ఆధునిక పోలీసింగ్ సాంకేతికతపై సిబ్బంది పూర్తి పట్టు సాధించాలని ఎస్పీ సూచించారు. క్రైమ్ ప్రోన్ ప్రాంతాల్లో నిఘా పెంచాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సరిహద్దు ప్రాంతం కావడంతో అక్రమ రవాణాపై నిఘా కట్టుదిట్టం చేయాలని, నాకాబందీ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ నిర్వహణ సంతృప్తికరంగా ఉందని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.ఈ తనిఖీల్లో జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, సీఐ రవి, ఎస్ఐలు పాల్గొన్నారు.

# పంచాయతీ ఉద్యోగ కార్మికుల వేతనాలు పెంచాలి

### ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డికి యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం



మెట్రో న్యూస్ కొల్చారం: గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కొల్చారం మండలంలో నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డికి యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె. నర్సమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, విద్యుత్ తదితర కీలక సేవలను గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు అనేక సంవత్సరాలుగా అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.మల్టీపర్పస్ వర్కర్ విధానం కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్రంలో 800 మందికి పైగా కార్మికులు మృతి చెందారని ఆమె పేర్కొన్నారు. నైపుణ్యానికి సంబంధం లేని పనులను కూడా చేయాల్సి రావడంతో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు.మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి కార్మికులను రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని, కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించాలని, దహన సంస్కారాల కోసం రూ.30 వేల ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలపై పునరాలోచించి తక్షణమే పరిష్కరించాలని నర్సమ్మ కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ మండల నాయకులు మల్లేశం, రవి, ప్రశాంత్, సత్యం, మల్లేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలకుఆరోగ్య పరిరక్షణ ఎంతోముఖ్యం.

### వైస్ చైర్మన్ చిట్టిబాబు.



మెట్రో న్యూస్ జోగిపేట్. ఆడపిల్లల ఆరోగ్యంపరిరక్షణ ఎంతో ముఖ్యమని ఎదిగే పిల్లలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆందోలు జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు అన్నారు. అందోల్ లోని కస్తూర్బా అందోల్ వట్టపల్లిగురుకుల పాఠశాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా శక్తి బేటి బచావో బేటి పడావో అనే కార్యక్రమాన్ని శిశు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల చదువుకుని సమాజంలో ముందడుగు వేయాలని సూచించారు. ఆరోగ్య రక్షణతో పాటు చదువు కూడా ఎంతో ముఖ్యమని సూచించారు. ఇందులో అందోల్ తహసిల్దార్ మధుకర్ రెడ్డి, కమిషనర్ తిరుపతి, ఎస్సై దుర్గయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి పల్లవి మేడం సిడిపిఓ, టీచర్ లు పాల్గొన్నారు.

### మండల విద్య అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎలిజబెత్



మెట్రో న్యూస్.. కొండాపూర్ కొండాపూర్ మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా బోధిస్తున్న ఎలిజబెత్ బుధవారం కొండపూర్ మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. వారు మాట్లాడుతూ మండల లో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో 2026,27 పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక దృష్టి పెట్టి జిల్లా స్థాయిలో కొండాపూర్ ప్రథమ స్థాయిలో 10/10 మార్కులు వచ్చేలా తన వంతు సహకరిస్తానని వారు కోరారు. ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల సంఘ ఎంఈఓ కార్యాలయంలో శ్యామలతో సన్మానించి స్వాగతం పలికారు.

## ప్రభుత్వం ఫోటోగ్రాఫర్లకు సబ్సిడీ రుణాలు అందించాలి

### పేటలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలు

### జెండా ఆవిష్కరించిన అధ్యక్షుడు నాగుల విజయ్ కుమార్



మెట్రోన్యూస్,సదాశివపేట :ప్రభుత్వం ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ కి సబ్సిడీపై రుణాలు అందించి ఫోటోగ్రాఫర్ల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని పట్టణ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుల విజయ్ కుమార్ అన్నారు. బుధవారం సదాశివపేట పట్టణంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగుల విజయ్ కుమార్ మాట్లాడుతూ మన చేతిలో ఉన్న కెమెరా ఒక పరికరం మాత్రమే కాదు... అది మన వృత్తికి గుర్తింపు. మన ఐక్యతే మన బలం అన్నారు. చరిత్రను భద్రపరిచే బాధ్యత ఫోటోగ్రాఫర్లదన్నారు.మన యువ ఫోటోగ్రాఫర్లు కొత్త టెక్నాలజీని నేర్చుకోవాలి. ఫోటోగ్రఫీతో పాటు వీడియో, డ్రోన్, ఎడిటింగ్, ఆల్బమ్ డిజైన్, సోషల్ మీడియా కంటెంట్, ఎ ఐ వంటి కొత్త రంగాల్లో కూడా నైపుణ్యం పెంచుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముదిగొండ జయచింతన్, కోశాధికారి కర్ణాకర్, ఉపాధ్యక్షులు కాషా సంగమేశ్వర్,వై మహేష్, శివశంకర్, గొల్లపల్లి శ్రీనివాస్, రుమాండ్ల రాజు, బండారి సుభాష్, ఎం సంతోష్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### మాచేపల్లిలో ఫారం పాండ్ భూమి పూజ చేసిన గ్రామ సర్పంచి లక్ష్మి కిషన్ నాయక్



మెట్రో న్యూస్.. కొండాపూర్ కొండాపూర్ మండల పరిధిలోని శనివారం మాచేపల్లి రైతు సిత్య పంట పొలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఫారం పౌండ్ పనులకు సర్పంచి లక్ష్మీ కిషన్ నాయక్ గ్రామస్తులతో కలిసి భూమి పూజ చేశారు ఈ సందర్భంగా.. సర్పంచి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా వర్షము మీరు భూగర్భ జలాలు పెంపొందించడంతో పాటు రైతులకు వ్యవసాయంలో నీటి కొరత సమస్య తలెత్తకుండా పంటలకు సాగునీటి వసతి కల్పించేందుకు ఫారం పౌండు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలోని గ్రామ సర్పంచ్ లక్ష్మీ కిషన్ నాయక్ ఏపీఓ వీరప్ప గణేష్ ఫీల్డ్ అసిస్టెంట్ సోమ్లా ప్రభాకర్ సాయిలు పంచాయతీ కార్యదర్శి హంసలేక వార్డ్ మెంబర్లు రైతులు పాల్గొన్నారు

### రత్నపురి లిస్ట్ ఆఫ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కళాశాల నిరసన

### శక్తి స్కీమ్ను తొలగించాలని విద్యార్థుల ఆందోళన



మెట్రో న్యూస్ హత్నూర: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం తుర్కా ఖానాపూర్ పరిధిలోని రత్నపూరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులు శక్తి స్కీమ్ను తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు కళాశాల ఎదుట బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శక్తి స్కీమ్ వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే శక్తి స్కీమ్పై తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల నిరసనకు ఏబీవీపీ నాయకులు మద్దతు తెలిపారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పటేల్ జస్వంత్ గౌడ్, శ్రీనివాస్తో పాటు ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పొంచి ప్రమాదం..

## పట్టించుకోని విద్యుత్ అధికారులు

**విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ - అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**



మెట్రో న్యూస్ (ఆగస్టు 19) మునగాల:మునగాల మండలం తాడ్వాయి గ్రామంలోని రణబోతు పిచ్చిరెడ్డి ఇంటి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రమాదకర స్థితిలో ఉంది. ట్రాన్స్ఫార్మర్ నుండి స్పార్కులు వస్తున్నాయని, వైర్లు కాలిపోయే స్థితిలో ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాన్స్ఫార్మర్ పక్కనే ఇళ్లు, పిల్లలు ఆడుకునే ప్రదేశం ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయపడుతున్నారు. వర్షం పడితే షార్ట్ సర్క్యూట్ అయ్యి పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని రోజులుగా ఈ విషయాన్ని పలుమార్లు స్థానిక విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ప్రజల డిమాండ్:
వెంటనే స్పందించి ట్రాన్స్ఫార్మర్ ను మరమ్మత్తు చేయాలని లేదా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని తాడ్వాయి గ్రామస్తులు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు. ప్రాణనష్టం జరిగిన తర్వాత చర్యలు తీసుకునే బదులు ఇప్పుడే స్పందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే ప్రక్రియలో మహిళలు ముందు ఉండాలి

**గ్రామీణ విద్యార్థులే లక్ష్యంగా కొత్త ప్రోగ్రామ్స్ యువత, మహిళల ఐడియాలకు వుయ్ హబ్ - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్..**



మెట్రో న్యూస్, (ఆగస్టు 19)సూర్యాపేట ప్రతినిధి: ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే ప్రక్రియలో సూర్యాపేట మహిళలు ముందు ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా శక్తి ఉత్సవంలో భాగంగా వుయ్ హబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూట్ క్యాంప్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా కలెక్టర్ మహిళలు తయారుచేసిన వివిధ రకాల వస్తువులు, పచ్చళ్ళు, జ్యూట్ బ్యాగులను పరిశీలించి అద్భుతంగా ఉన్నాయని అభినందించారు తదుపరి మహిళలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి వస్తువులను తయారు చేసుకొని ఇంటి గడప దాటి ఇక్కడకు వచ్చిన మహిళామణులకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. మహిళామణులు అన్ని రంగాలలో ముందుండాలని మహిళా సంఘాలకు సూర్యాపేట జిల్లాలో 700 కోట్ల రుణాలు ఇవ్వడం జరిగినదని, వాటిని ఇంటి ఖర్చులకు, విద్య, వైద్యం మీద ఖర్చు పెట్టకుండా ఏదో ఒక వ్యాపారం లేదా గ్రూపుగా ఏర్పడి యూనిట్ ఏర్పాటు చేసుకొని లాభాలు అర్జించుకొని మీ కాళ్ళ మీద మీరు ఉన్నత స్థానానికి ఎదగాలని, ప్రతి మండలం గ్రామం నుండి ఒక యూనిట్ రావాలని, కష్టపడే తపన మనలో ఉండాలని, మీరు మీ ఇంటి ఆదాయం పెంచుకోవాలని ఆశ, స్ఫూర్తి, తపన ఉంటే దానికి దారి తొలి అడుగు తీసుకోవాలి అంటే వుయ్ హబ్ మీకు అండగా ఉంటుందని, మహిళలు తమ ఉత్పత్తులను తయారు చేసుకోవడానికి, మార్కెటింగ్ చేసుకోవడానికి వుయ్ హబ్ మీకు కావాల్సిన సలహాలు సూచనలు ఇస్తుందని, మహిళలకు సూర్యాపేటలో మహిళా శక్తి భవనం నిర్మాణం చేపడుతున్నామని త్వరలో దాన్ని ప్రారంభం చేసుకోవడం జరుగుతుందని. మీకు ఇంకేమైనా సందేహాలు సూచనలు ఉంటే సోమవారం నుండి శుక్రవారం వరకు ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 04:00 గంటల వరకు 9391609994 నెంబర్ కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని అలాగే ప్రొడక్ట్స్ తయారు చేయు మహిళలకు సంబంధించి వాట్సప్ గ్రూపు, వాట్సప్ ఛానల్ క్రియేట్ చేయవలసినదిగా డిఆర్డిఓ పి డి కి కలెక్టర్ సూచించారు. డి ఆర్ డి ఓ పిడి సన్యాసయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటున్న వారి అందరిని ఒక గ్రూపుగా తీసుకొని వారిని అత్యున్నత స్థాయికి తీసుకుపోవు లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కావున మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తదుపరి సి ఇ ఓ సీత పళ్ళచుని మాట్లాడుతూ వుయ్ హబ్ మహిళల కోసం స్థాపించబడిందని చిన్న మార్కెట్ అనుకోకుండా రాష్ట్ర జాతీయ స్థాయిలో ఎలా ప్రొడక్ట్స్ ఎలా మార్కెట్ చేయాలోఉపయోగించుకోవాలని, అవకాశాలు ఎలా ఉపయోగించుకోవాలో మీ మీద ఆధారపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ నరసింహారావు, అడిషనల్ డి ఆర్ డి ఓ పి డి సురేష్, డిపిఎం అరుణ్ కుమార్, ఏపీఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు స్వయం సహాయక మహిళలు, వుయ్ హబ్ అసోసియేట్ డైరెక్టర్ జహీర్ అక్తర్ షేక్, ఊహ సజ్జ, టీం సభ్యులు పాల్గొన్నారు

# వినియోగదారుల మన్ననలు పొందాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను విక్రయించి వారి మన్ననలు పొందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన లక్ష్మణ్ ఎలక్ట్రానిక్ సేల్స్ అండ్ సర్వీస్ షాపును ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసే వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులతో పాటు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. క్రొత్తగా ప్రారంభించిన లక్ష్మణ్ ఎలక్ట్రానిక్ సేల్స్ అండ్ సర్వీస్ షాప్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది,అనంతుల కృపాకర్, శనగాని రాంబాబు, రాచకొండ శ్రీనివాస్, కమ్రుద్దీన్, వెంకన్న, చీకూరి అశోక్, జగదీష్, నిర్వాహకులు చీకూరి లక్ష్మణ్, సుజాత, సాయి,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం.



హాలియా,మెట్రో న్యూస్,హాలియా మున్సిపాలిటీ పరిధిలో ఫోటో,వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఫోటో గ్రఫీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పట్టణంలో ద్విచక్ర వాహనాలపై సందడి చేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఫోటోగ్రఫీ కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని,జ్ఞాపకాలను సజీవంగా నిలిపే అద్భుతమైన కళ అని అన్నారు. కెమెరా వెనుక నిలబడి ఎంతోమంది జీవితాల్లోని తీపి జ్ఞాపకాలను,చిరునవ్వులను బంధిస్తున్న ప్రతి ఫోటోగ్రాఫర్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రఫీ కళను,కళాకారులైన ఫోటోగ్రాఫర్లను సమాజం గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు.

## వెలిదండలో ముమ్మరంగా దోమల మందు పిచికారీ

**డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు**

**సర్పంచ్ చెనగాని సాంబయ్య ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు**



మెట్రో న్యూస్(ఆగస్టు19),గరిడేపల్లి:వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో ముందస్తు నివారణ చర్యలు చేపడుతున్నట్లు వెలిదండ గ్రామ సర్పంచ్ చెనగాని సాంబయ్య తెలిపారు. గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో బుధవారం సర్పంచ్ ఆధ్వర్యంలో పలు వీధులు, కాలనీల్లో దోమల మందును ముమ్మరంగా పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వానాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి తీవ్రమైన వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి దోమల నివారణ మందులను పిచికారీ చేయిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి బొండాలు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగేంద్రబాబు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సూర్యాపేటకు రైల్వే లైన్ సౌకర్యం కల్పించాలి

**సూర్యాపేట పట్టణంలో ర్యాలీ**



మెట్రో న్యూస్, (ఆగస్టు 19)సూర్యాపేట ప్రతినిధి: జాతీయ రహదారి 65 గుండా యధావిధిగా మొదటి అలైన్ మెంట్ ప్రకారం సూర్యాపేటకు రైల్వే లైన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ పట్టణంలో రైల్వే సాధన సమితికి మద్దతుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఐడిఏ, మెడికల్ షాపు అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, జ్యువెలరీ అసోసియేషన్, పట్టణ స్వర్ణకార సంఘం జిల్లా కేంద్రంలోని కల్నల్ సంతోష్ బాబు విగ్రహం నుంచి బుధవారం కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి పలువురు మాట్లాడారు. వందే భారతి హై స్పీడ్ రైలు సౌకర్యం కల్పించాలని ట్రైన్ అలైన్మెంట్ రద్దును వెంటనే కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని లేనిపక్షంలో ప్రజాసంఘాలు, అనేక పార్టీల సహకారంతో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మొదటి అలైన్మెంట్ ప్రకారం రైల్వే సౌకర్యం సూర్యాపేటకు కేటాయించకుండా తీరని అన్యాయం చేశారని ఆక్షేపించారు. రైల్వే సౌకర్యం తో సూర్యాపేట ఎంతో అభివృద్ధి చెందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్, కో కన్వీనర్లు రాచూరి ప్రతాప్, డాక్టర్.రమేష్ చంద్ర, ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు సల్వాది రమేష్ కుమార్ కార్య దర్శి ఆనంద రావు ,కోశాధికారి రూపేందర్ సింగ్ ఐఎం ఎ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయ్ కార్య దర్శి సింహాద్రి కోశాధికారి బూర్లె మధుసూదన్, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు తొగిటి మురళి, పలు సంఘాల నాయకులు, ర్యాలీ లో పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ

**మ్యాపింగ్ కానీ, జాబితాలో పేర్లు తేడా ఉన్న కేసులకు తదుపరి చర్యలు**

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



నల్గొండ బ్యూరో, మెట్రో న్యూస్ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం మ్యాపింగ్ కానీ, జాబితాలో పేర్లు తేడా ఉన్న కేసులకు సంబంధించి నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియపై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నల్గొండ జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం 33,818 అన్‌మ్యాపింగ్ 2,34,972 అనామలీస్ ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 6 ఈఆర్ఓలు, 12 మంది ఏఈఆర్ఓలు ఉన్నారని, అదనంగా మరో 12 మంది ఏఈఆర్ఓలు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవడంతో పాటు, క్షేత్రస్థాయిలో బూతు స్థాయి అధికారులు, సూపర్వైజర్లు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి పూర్తి అవగాహన కల్పిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం జారీ చేసే నోటీసులను సంబంధిత బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు సక్రమంగా అందజేయాలని చెప్పారు. నోటీసులు అందించిన వ్యక్తుల సంతకాలను తీసుకోవాలని, డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అదేవిధంగా ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించిన దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారికి పూర్తి వివరాలను తెలియజేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పూర్తిగా పారదర్శకంగా రూపొందించేలా లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవిన్యూ అధికారి దశరథ ,ఎలక్షన్ అధికారులు హాజరయ్యారు.

# నానో యూరియా డిపి వినియోగం సమీకృత తెగులు నివారణపై అవగాహన

మిర్యాలగూడ, మెట్రో న్యూస్.నానో యూరియా, నానో డీఏపీ వినియోగం సమీకృత తెగులు నిర్వహణపై రైతులకు చింతపల్లి కిష్టపురం గ్రామాలలో బుధవారం మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి మేకల బుష్యేంద్రమణి అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో డెమాన్‌స్ట్రేషన్లు, రైతు అవగాహన సమావేశాలు నిర్వహించారు. రైతులకు నానో యూరియా, నానో డీఏపీ వినియోగ విధానం, ప్రయోజనాలు సమీకృత తెగులు నిర్వహణపై అవగాహన కల్పించారు. నానో యూరియా, నానో డీఏపీలు ద్రవరూపంలో లభించే ఆధునిక నానో ఎరువులని, పంట అవసరాన్ని బట్టి సిఫారసు చేసిన మోతాదులో నీటిలో కలిపి ఆకులపై పిచికారీ చేయడం ద్వారా మొక్కలకు పోషకాలు అందించవచ్చని అధికారులు వివరించారు. పంట ఎదుగుదల దశలో, అలాగే పూత/పిందె దశలో ఆకుల పైభాగం, క్రింది భాగం తడిసేలా పిచికారీ చేయాలని సూచించారు. వీటి వినియోగం ద్వారా పోషకాల సమర్థ వినియోగం, రవాణా నిల్వలో సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. సమీకృత తెగులు నిర్వహణలో రసాయన పురుగుమందులపై



పూర్తిగా ఆధారపడకుండా జీవ, యాంత్రిక ఇతర పద్ధతులను సమన్వయం చేసుకుని తెగుళ్లను నియంత్రించవచ్చని రైతులకు వివరించారు. దీని ద్వారా పురుగుమందుల వినియోగం, సాగు ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, మిత్ర పురుగుల సంరక్షణ మరియు పురుగుమందుల నిరోధకత ఏర్పడకుండా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ పార్వతి, బీటీఎం గిరి, రవి, నాగరాజు, కృష్ణారెడ్డి, లింగనాయక్, రవి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవం



మెట్రో న్యూస్ చిట్యాల ఆగస్టు 19 చిట్యాల పట్టణం లో బుధవారం మండల ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ 187 వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏళ్ల బయ్యన్న,రాష్ట్ర మహిళా సహాయ కార్యదర్శి ఏళ్ల మాధవి లూయిస్, డాగురే చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు దేవర బొయున సైదులు, సుఖేందర్ రెడ్డి,ఆవుల ఆనంద్,సుధీర్ పాల్గొన్నారు.

## 31న చలో ఇందిరా పార్క్ మహాధర్నాను జయప్రదం చేయండి

**ఎండి జహంగీర్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు**

వలిగొండ మెట్రో న్యూస్:యాదాద్రి భువనగిరి జిల్లా పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనకై డిమాండ్ చేస్తూ ఆగస్టు 29,30,31 తేదీల్లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని 29 తేదీన న, భువనగిరి అంబేద్కర్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై 31న ఇందిరా పార్క్ కు చేరుకొని మహా ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని 31న జరిగే చలో హైదరాబాద్ ఇందిరా పార్క్ మహాధర్నాను వేలాదిగా రైతులు,ప్రజలుపాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జహంగీర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశం కందడి సత్తిరెడ్డి అధ్యక్షతన జరగగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు మొగిలిపాక గోపాల్, చీర్క శ్రీశైలం రెడ్డి,కర్ణకంటి యాదయ్య,దుబ్బ లింగం, భీమనబోయిన జంగయ్య, శాఖ కార్యదర్శులు ప్రజా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు దయ్యాల మల్లేశం,చేగూరి నగేష్, దొడ్డి బిక్షపతి,రాధారపు మల్లేశం, కర్నాటి మత్స్యరాణి, శీలం ఇందిర,కొండూరు సత్తయ్య, ఉండ్రాటి పాపయ్య, వేముల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఒక ఫోటో వేల మాటలు చెప్పగలదు..

### -ఫోటో జార్నలిస్టుల సేవలు అమోఘం...

### -" ప్రపంచ ఫోటో గ్రఫీ డే" లో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...





నిజామాబాద్, ఆగష్టు 19( మెట్రోన్యూస్ )ఒక ఫోటో వేల మాటలు చెప్పగలదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు . నగరంలోని ప్రెస్ క్లబ్ లో బుధవారం ప్రెస్ ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటో గ్రఫీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫోటోగ్రాఫర్ అంటే కేవలం ఫోటోలు తీయడమే కాకుండా సమాజంలో జరిగే మంచి, చెడు, చారిత్రక సంఘటనలను భవిష్యత్ తరాలకు భద్రపరిచే వారన్నారు. చరిత్రలోని ఎన్నో ముఖ్య ఘట్టాలు ఫోటోల ద్వారానే మనకు గుర్తుండిపోతాయన్నారు.ప్రకృతి విపత్తులు, సామాజిక కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, విజయాలు, ప్రతి అంశాన్ని ప్రజల ముందుకు తీసుకురావడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకం అని చెప్పారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కృషి...

జర్నలిస్టుల చిరకాల వాంఛ ఇళ్ళ స్థలాల కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. నిజామాబాద్ జర్నలిస్టుల్లో ఐక్యత ఉంటుందని, ఇదే ధోరణితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రతన్, ప్రధాన కార్యదర్శి భానూతేజ, గౌరవ అధ్యక్షుడు గోవిందరాజు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పంచరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుభాష్, కోశాధికారి రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు, సీనియర్ ఫోటో గ్రాఫర్లు మల్లెపూల నరసింహ చారీ,బాలరాజు, వీడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు నాగేష్, సీనియర్ ఫోటో గ్రాఫర్లు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మహిళలకు అండగా షీ టీం సేవలు.

### అచ్చంపేట డిఎస్పి పల్లె శ్రీనివాస్.



మెట్రో న్యూస్ అచ్చంపేట (ఆగస్టు 19):సమాజంలో మహిళలు చిన్నారులు వృద్ధులపై జరుగుతున్న అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు వారికి అండగా షీ టీం ఉంటుందని అచ్చంపేట డిఎస్పి పల్లె శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. బుధవారం అచ్చంపేట మండల పరిధిలోని ఐనోలు గిరిజన బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలలో జిల్లా షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినిలకు జిల్లా కళాబృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్పి పల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ షీ టీం చిన్నపిల్లల నుండి వయోజనులు, మహిళలు వృద్ధులకు ఎవరైనా ఇంటి పక్కల వ్యక్తులుకానీ,రోడ్డుపై వెళ్తున్న కూడా ఎవరినైనా వేధించినట్టు అయితే వెంటనే డయల్ 112 నెంబర్ కు సమాచారం ఇచ్చినట్లయితే షీటీం బృందం తక్షణం స్పందించి బాధితులకు అండగా నిలిచి పోకిరిల భరతం పడతారని సూచించారు. బాలికలు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సోషల్ మీడియాలో వచ్చే అసభ్యకరమైన లింకులను లేదా అనవసరమైన వాటి జోలికి వెళ్ళవద్దని సూచించారు. అదేవిధంగా మానవులను అక్రమంగా ఎవరైనా రవాణా చేపడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సి సి ఎస్ సి ఐ శంకర్, షీ టీం జిల్లా ఇన్చార్జ్ విజయలక్ష్మి, అచ్చంపేట సీఐ నాగరాజు, సిద్దాపూర్ ఎస్సై అంజయ్య, షీ టీం బృందం సభ్యులు వెంకటయ్య మల్లేష్, వెంకట్ నాయక్, జానకి రాములు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు అండగా షీ టీం సేవలు.

### అచ్చంపేట డిఎస్పి పల్లె శ్రీనివాస్.



మెట్రో న్యూస్ అచ్చంపేట (ఆగస్టు 19):సమాజంలో మహిళలు చిన్నారులు వృద్ధులపై జరుగుతున్న అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు వారికి అండగా షీ టీం ఉంటుందని అచ్చంపేట డిఎస్పి పల్లె శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. బుధవారం అచ్చంపేట మండల పరిధిలోని ఐనోలు గిరిజన బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలలో జిల్లా షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినిలకు జిల్లా కళాబృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్పి పల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ షీ టీం చిన్నపిల్లల నుండి వయోజనులు, మహిళలు వృద్ధులకు ఎవరైనా ఇంటి పక్కల వ్యక్తులుకానీ,రోడ్డుపై వెళ్తున్న కూడా ఎవరినైనా వేధించినట్టు అయితే వెంటనే డయల్ 112 నెంబర్ కు సమాచారం ఇచ్చినట్లయితే షీటీం బృందం తక్షణం స్పందించి బాధితులకు అండగా నిలిచి పోకిరిల భరతం పడతారని సూచించారు. బాలికలు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సోషల్ మీడియాలో వచ్చే అసభ్యకరమైన లింకులను లేదా అనవసరమైన వాటి జోలికి వెళ్ళవద్దని సూచించారు. అదేవిధంగా మానవులను అక్రమంగా ఎవరైనా రవాణా చేపడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సి సి ఎస్ సి ఐ శంకర్, షీ టీం జిల్లా ఇన్చార్జ్ విజయలక్ష్మి, అచ్చంపేట సీఐ నాగరాజు, సిద్దాపూర్ ఎస్సై అంజయ్య, షీ టీం బృందం సభ్యులు వెంకటయ్య మల్లేష్, వెంకట్ నాయక్, జానకి రాములు, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకత, ఖచ్చితత్వంతో భూముల రీసర్వే ప్రక్రియ చేపట్టాలి

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



మెట్రో న్యూస్ రాజన్న సిరిసిల్ల తంగళ్ళపల్లి, ఆగష్టు -19పారదర్శకత, ఖచ్చితత్వంతో భూముల రీసర్వే ప్రక్రియ చేపట్టాలని, గ్రామంలోని ప్రజలకు అందరికీ రీసర్వేపై సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.బుధవారం తంగళ్ళపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూముల రీసర్వే చేపట్టాలని, ఖచ్చితత్వంతో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. భూముల రీసర్వే కు సంబంధించి గ్రామంలోని ప్రజలకు సమాచారం అందించి, అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. పరిశీలనలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలి - గట్టు ఎస్సై శేఖర్ గౌడ్

గట్టు (మెట్రో న్యూస్, ఆగస్టు 19): విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేయాలని ఎస్ఐ శేఖర్ గౌడ్ విద్యార్థులకు సూచించారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీల్లో భాగంగా సెల్ ఫోన్, లాభనష్టాలపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయా పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు 48 మంది పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ సెల్ ఫోన్ వినియోగం మంచికి ఉపయోగించాలని, చెడుకు దూరంగా ఉండాలన్నారు. ఫోక్సో కేసులు సెల్ఫోన్ ప్రభావంతోనే పెరుగుతున్నాయని తెలిపారు. సెల్ ఫోన్ ప్రభావం వల్ల గ్రామీణ ఆటలను విద్యార్థులు పూర్తిగా మర్చిపోయో పరిస్థితి నెలకొందన్నారు. అనవసర మెసేజ్ లను టచ్ చేయడం వల్ల అనర్థాలు సంభవిస్తాయన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, విద్యార్థి దశలోనే మంచి విలువలతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. గురువారం విద్యార్థులకు ప్రతిభ పోటీల్లో భాగంగా పాటల పోటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్య మండల జిల్లా కార్యదర్శి ఆశన్న తెలిపారు. ఆంజనేయులు, వెంకటేష్, పోలీస్ సిబ్బంది బుడ్డన్న, ముస్తాక్, మేఘన, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ సుశీల్ రావు ఆధ్వర్యంలో స్పెషల్ కన్సల్టేషన్



ఆర్మూర్, ఆగస్టు 19 ( మెట్రో న్యూస్ )సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలో ప్రత్యేక ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందించేందుకు స్పెషల్ కన్సల్టేషన్ నిర్వహించనున్నారు. ప్రతి నెల 3వ బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆర్మూర్ లోని అపర్ణ హాస్పిటల్‌లో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రత్యేక కన్సల్టేషన్‌లో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ పద్ధతి ద్వారా భుజం మరియు మోకాలి మార్పిడి, మోకాళ్లకు కీ హోల్ సర్జరీ, మోకాళ్ల లిగమెంట్ గాయాలు, భుజం గూడు తప్పుట, కండరం చిరిగిన సమస్యలు, మృదులాస్థి (కార్టిలేజ్) సర్జరీ, స్పైనల్ చికిత్స తదితర ఆర్థోపెడిక్ సమస్యలకు వైద్య సలహాలు అందించనున్నారు. యశోద హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ సుశీల్ రావు సంకినేని మీా (ాతీఫ్ట్రశీ) -- ూా××మీా, ఢిల్లీతో పాటు షోల్డర్ సర్జరీ (ఫ్రాన్స్), ఆర్థ్రోస్కోపీ అండ్ కార్టిలేజ్ సర్జరీ (ఇటలీ), హిప్ అండ్ నీ ఆర్థ్రోప్లాస్టీ (ఆస్ట్రేలియా), హిప్ ఆర్థ్రోస్కోపీ (ఫ్రాన్స్) తదితర విభాగాల్లో ఫెలోషిప్‌లు పూర్తి చేసిన నిపుణుడిగా పోస్టర్‌లో పేర్కొన్నారు. ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ స్పెషల్ కన్సల్టేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. అపాయింట్‌మెంట్ కోసం: 852 090 8991, 915 402 9776 ఈ నంబర్లకు సంప్రదించగలరు.

# జిల్లా ఇంచార్జి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



నిజామాబాద్, ఆగస్టు 19 ( మెట్రోన్యూస్ )నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి డి.అనసూయ సీతక్కను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీలకు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

### ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన . ..

### కల్వకుర్తి డి వి జ న్ ఫోటో వీడియో గ్రాఫర్స్ యూనియన్ నాయకులు. ..

కల్వకుర్తి ఆగష్టు 19 (మెట్రో న్యూస్ ) కల్వకుర్తిపట్టణంలో డివిజన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని లయన్స్ క్లబ్ భవన్ లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గముఖ్య అతిథిగా హాజరయ్యారు..ఈ సందర్భంగా ఫోటో, వీడియో గ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం ఫోటోగ్రఫీ రంగం ప్రాముఖ్యతను వివరిస్తూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడారు ఫోటోగ్రఫీ ఆవిర్భావం నుంచి నేటి ఆధునిక డిజిటల్ ఫోటోగ్రఫీ వరకు ఈ రంగం ఎన్నో మార్పులు, సాంకేతిక అభివృద్ధిని సాధించిందని తెలిపారు. ఒకప్పుడు ఒక జ్ఞాపకాన్ని ఫోటో రూపంలో భద్రపరచడమే ప్రధానంగా ఉన్న ఫోటోగ్రఫీ, నేడు ఆధునిక కెమెరా టెక్నాలజీ, వీడియో గ్రాఫీ, డ్రోన్ ఫోటోగ్రఫీ, సినిమాటోగ్రఫీ, ఫోటో వీడియో ఎడిటింగ్ గ్రాఫిక్ డిజైనింగ్, సోషల్ మీడియా కంటెంట్ క్రియేషన్ వంటి అనేక విభాగాలతో విస్తరించిందన్నారు ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం కెమెరా వినియోగంపై మాత్రమే కాకుండా ఆధునిక సాఫ్ట్‌వేర్, ఎడిటింగ్, డిజైనింగ్, వీడియో ప్రొడక్షన్ తదితర నైపుణ్యాలపై పట్టు సాధించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫోటో, వీడియో గ్రాఫర్లకు త్వరలో ఉచిత నైపుణ్య శిక్షణ కోర్సు కల్వకుర్తి మరియు పరిసర ప్రాంతాల్లోని ఫోటో, వీడియో గ్రాఫర్ల నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసేందుకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో ప్రత్యేక నైపుణ్య శిక్షణ కోర్సును ఉచితంగా ఏర్పాటు చేస్తామని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హామీ ఇచ్చారు పాటు టెక్నాలజీ మారుతోంది టెక్నాలజీ మారుతున్న కొద్దీ మన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలి. ఫోటోగ్రఫీని వృత్తిగా కొనసాగిస్తున్న వారికి ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి, వారి వృత్తిపరమైన అభివృద్ధికి నా వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను" అని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హామీ ఇచ్చారు

# నీట్ పీజీ 2026 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

వరంగల్ (ఆగస్టు 19) మెట్రో ఈవినింగ్స్ నీట్ పీజీ 2026 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టి, పరీక్షను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నీట్ పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.వరంగల్‌లోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్, లక్నేపల్లి , నర్సంపేట లో నీట్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చినందున, అట్టి ఏర్పాట్లను పకడ్బడిగా ఏర్పాట్లు చేయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.పరీక్షా కేంద్రంలో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, పరీక్ష నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.అభ్యర్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకునేలా అవసరమైన సమాచారాన్ని అందించాలని, పరీక్ష సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకో కుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్ష నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు




చేపట్టడంతో పాటు, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమీక్షలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డిఆర్వో విజయ లక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి సాగాలి.

### ఎమ్మెల్యే గంగుల కమలాకర్

### మున్సిపల్ అధికారులతో ఉన్నత

### స్థాయి సమీక్షా సమావేశం

కరీంనగర్ బ్యూరో మెట్రో న్యూస్ పారిశుద్ధ్యం, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రతీ డివిజన్‌కు సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. నగర అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు తీసుకెళ్లాలని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. పార్టీలకు తావు లేకుండా కేవలం నగర అభివృద్ధి ఒక్కటే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ కపుల్ దేశాయ్ మరియు ఇంజనీర్ అధికారులతో కలిసి నగర అభివృద్ధిపై ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ




సందర్భంగా నగరంలో ప్రస్తుతం నెలకొన్న వివిధ ప్రజా సమస్యలపై చర్చించి, వాటికి తక్షణ పరిష్కారం చూపే దిశగా అధికారులకు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు.పారిశుద్ధ్యం, విద్యుత్ నిర్వహణ: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ ఎక్కడా లోపించకుండా ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ సదుపాయాలను మెరుగుపరచడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో వర్షపు నీటితో లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తుగా అప్రమత్తం కావాలన్నారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.

విలీన గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ : నగరంలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మౌలిక వసతులు కల్పించాలని చొరవ చూపాలని చెప్పారు.

నిధుల సమాన పంపిణీ: స్మార్ట్ సిటీ, యూడీఐఎఫ్, యూసీఎఫ్ నిధులను ఏ ఒక్క డివిజన్‌కు పరిమితం చేయకుండా... ప్రతి డివిజన్‌కూ సమానంగా కేటాయించి సమగ్రంగా అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, కార్పొరేటర్లు నలువాల రవీందర్, గుగ్గిల్లపు జయశ్రీ, సుధగోని మాధవి, జమ్ము, యూసుఫ్, అలీ, గడ్డి ప్రదీప్, మల్లేశం, పలువురు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 6వ వార్డు ఎకిన్‌పూర్‌లో ఇది రోడ్డా..? లేక బురద మడుగా..?

### పాలకులు, అధికారులు మారుతున్నారు..కానీ ప్రజల

### కష్టాలు మాత్రం తీరడం లేదు!

జగిత్యాల జిల్లా/కోరుట్ల, ఆగస్టు 19 (మెట్రో న్యూస్) : కోరుట్ల మున్సిపాలిటీ 6వ వార్డు ఎకిన్‌పూర్‌లో ప్రధాన రహదారి వర్షం పడితే మట్టి చెరువుగా మారుతోంది. గుంతల్లో నీరు నిలిచి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు రాకపోకలకు అవస్థలు పడుతుండగా, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. పాలకులు, అధికారులు మారినా ఎకిన్‌పూర్ రోడ్ల పరిస్థితి మాత్రం మారలేదు. అభివృద్ధి మాటల్లో కాదు, రోడ్లపై కనిపించాలి. అందువల్ల కోరుట్ల మున్సిపల్







కమిషనర్ వెంటనే స్పందించి, రహదారిని పరిశీలించి, తాత్కాలిక పనులతో కాకుండా శాశ్వత నాణ్యమైన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. డ్రైనేజీ సమస్యలు, నీరు నిలిచే ప్రాంతాలను కూడా పరిష్కరించాలి. ప్రజల ప్రశ్న ఒక్కటే --- "రోడ్డు ఎప్పుడు వేస్తారు?" అని, ఎకిన్‌పూర్ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బిజెపి కోరుట్ల పట్టణ ప్రధాన కార్యదర్శి, ఎర్ర రాజేందర్ డిమాండ్ చేశారు.

# బాల్య వివాహాల నివారణలో అంకుసాపూర్ ఆదర్శం

తంగళ్లపల్లి,మెట్రో న్యూస్: బాల్య వివాహాలను అరికట్టడంలో, బాలల హక్కులను పరిరక్షించడంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని అంకుసాపూర్ గ్రామం ఆదర్శంగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపెల్లి చందన అన్నారు.అంకుసాపూర్ గ్రామాన్ని సందర్శించిన ఆమె బాల్య వివాహాల నివారణకు గ్రామస్థులు, స్థానిక నాయకులు చేస్తున్న కృషిని అభినందించారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్యకు ఆటంకం కలగడంతో పాటు వారి ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు.బాలికలకు విద్యను అందించి, వారి హక్కులను కాపాడుతూ, బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. బాలల రక్షణ విషయంలో గ్రామస్థులు చూపుతున్న చైతన్యం అభినందనీయమని




పేర్కొన్నారు.బాల్య వివాహాలను అడ్డుకోవడంలో అంకుసాపూర్ గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందని మర్రిపెల్లి చందన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,




మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సన్న వడ్ల బోనస్ కోసం ఆన్లైన్ లో నమోదు తప్పనిసరి

శంకరపట్నం మెట్రో న్యూస్ ఆగస్టు 19 : తెలంగాణ ప్రభుత్వం వానకాలం 2026 గుర్తించిన 7 రకాల సన్న వరి సాగు చేస్తున్న రైతులు 500 రూపాయల బోనస్ కోసం తప్పనిసరిగా ఆన్లైన్ లో వివరాలు నమోదు చేయించుకోవాలి వ్యవసాయ అధికారి జి వెంకటేష్ తెలిపారు.

ప్రైవేట్, సొసైటీ ల దగ్గర విత్తనం కొన్న రైతులు సంబంధిత డీలర్, సొసైటీ నిర్వాహకుల దగ్గర వివరాలు ఆన్లైన్ నమోదు చేయించుకోవాలి




స్వంత విత్తనం, సీడ్ ప్లాంట్, యూనివర్సిటీ, పరిశోధనా స్థానాలలో విత్తనం తెచ్చుకున్న రైతులు ఏఈఓ లను సంప్రదించాలని తెలిపారు.

చివరి తేదీ 10-09-2026.

ఆన్లైన్లో లో సాగు వివరాలు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే సన్న వడ్ల బోనస్ పొందేందుకు అర్హత ఉంటుందని ఏ ఓ తెలిపారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు

## ఎమ్మెల్యే కవ్వంపల్లి



మానకొండూరు మెట్రో న్యూస్ ఆగస్టు 19 :అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి గ్రామంలో పాంద్రాల స్వప్న--ప్రవీణ్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సంక్షేమ పథకాలు అండగా నిలుస్తాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న స్వప్న--ప్రవీణ్ దంపతులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, స్థానిక సర్పంచ్ కనకం సుజాత-సంపత్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కనకం కుమార్, గట్టు దుద్దెనపల్లి చైర్మన్ సొసైటీ చైర్మన్ గంగుల రాంరెడ్డి, వైస్ చైర్మన్ కనక రాజేశం, పార్టీ నాయకులు ఓదెల యాదవ్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, రామిడి తిరుమల్ రెడ్డి, వై.సుధాకర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, బాకారపు సమ్మయ్య,బి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# "మెట్ పల్లి" ప్రిన్సిపాల్ ను ప్రశంసించిన సీసీఈ జాయింట్ డైరెక్టర్ లు



జగిత్యాల జిల్లా/మెట్ పల్లి, ఆగస్టు 19 (మెట్రో న్యూస్) : జగిత్యాల జిల్లా స్థాయిలో మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య ను సీసీఈ జాయింట్ డైరెక్టర్ లు ప్రశంసించారు. బుధవారం ఉత్తమ సేవలందించినందుకు గాను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య కమీషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కార్యాలయం జాయింట్ డైరెక్టర్ లు ప్రొఫెసర్ డి ఎస్ ఆర్ రాజేందర్ సింగ్, ప్రొఫెసర్ పీ. బాల భాస్కర్ లు ప్రిన్సిపాల్ ను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాలలో సమయ పాలన పాటించటం, సిబ్బంది సహకారంతో అడ్మిషన్స్ కోసం వివిధ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించుట, విద్యార్థులతో పాటు సిబ్బంది సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలుకు ప్రాముఖ్యత, ఉన్నతాధికారులకు ఉత్తర, ప్రత్యుత్తరాల ద్వారా సమాచారం అందించటం వంటి అన్ని అంశాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతోనే తెలంగాణ రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి అజారుద్దీన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారని పేర్కొంటూ, సీసీఈ జాయింట్ డైరెక్టర్ లు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్వీట్ లను పంపిణీ చేశారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు చేసిన సమష్టి కృషి వల్లనే తనకు ప్రశంసా పత్రం లభించిందని గుర్తు చేస్తూ, అందుకు వారందరికీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఇదే విధంగా సహాయ,సహకారాలు ఎల్లవేళలా అందించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

### అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### మహిళ భద్రతపై విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో ప్రత్యేక

### అవగాహన కార్యక్రమాలు: జిల్లా షీ టీమ్.




ముస్తాబాద్, ఆగస్ట్ 19(మెట్రో ఈవినింగ్):జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచనల మేరకు జిల్లా షీ టీమ్ ప్రతి రోజూ విద్యాసంస్థలు, మహిళలు పని చేసే ప్రదేశాలను సందర్శిస్తూ గుడ్ టచ్ / బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్,(1930 ), ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్(ఈ ఆర్ ఎస్ ఎస్ ) 112 , మరియు టీ - సేఫ్ , షీ టీమ్ సేవలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా షీ టీమ్ బృందం బుధవారం రోజున ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని జెడ్ పి హెచ్ ఎస్, ఎంపీపీ ఎస్ , బంధనకల్ గ్రామంలోని జెడ్ పి హెచ్ ఎస్ , ఎంపీపీ ఎస్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించి, వేధింపులకు గురైతే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని , ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, రవి. సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.